సాక్షి నల్లగొండ

బుధవారం । 5 । జూలై । 2023



ఆకర్షిస్తున్న బుద్ధవనం

బుద్ధవనం బౌద్ధ పరిశోధకులను ఆకర్షిస్తుందని బుద్దిస్ట్ ఎక్స్‌పర్ట్ కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. - 10లో



తన్నులాటలకే పరిమితం

కుమ్ములాటలు, తన్నులాటలకే కాంగ్రెస్ పార్టీ పరిమితమైందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 30°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామగిరి(నల్లగొండ): పీసీఎస్‌ను రద్దు చేయాలని జూలై 23న హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన చావ రవి, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జోనల్ జాయింట్ సెక్రటరీ జి.తిరుపతయ్య కోరారు. మంగళవారం నల్లగొండలోని యూటీఎఫ్ భవనంలో జాయింట్ ఫోరం ఫర్ రెస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు భద్రత లేని నూతన పెన్షన్ విధానానికి తాము వ్యతిరేకమన్నారు. ఉద్యోగుల అభ్యర్థన మేరకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయి కన్వెన్షన్‌లో పాల్గొని తమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సమావేశంలో వివిధ సంఘాల సభ్యులు ఎం.సోమయ్య, డీఎస్.రఘు, ఎం.శ్రీనివాస్, వెంకటేశ్, నిమ్మనగోటి జనార్దన్, ఎడ్ల సైదులు, గఫార్, రత్నయ్య, రామకృష్ణ, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : ప్రభుత్వం ఉపాధి కల్పనకు చేపట్టిన టోమ్‌కాం సంస్థ ద్వారా విదేశాలల్లో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ తెలిపారు. దోహఖతార్‌లో ఆలివ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మదర్ టీచర్‌గా, సోషల్ స్టడీస్, ఆర్ట్స్ ఎకనామిక్స్, డాన్స్ టీచర్ ఉద్యోగానికి గ్రాడ్యుయేట్‌తోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు.. సీబీఎస్ఈ పాఠశాలల్లో 2 నుంచి 3 సంవత్సరాలు పని చేసిన అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. జీతం రూ.79,000 నుంచి రూ.1.2 లక్షలు, వసతి, రవాణా, వైద్యం, బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత ఉండి ఆసక్తిగల ఉపాధ్యాయులు బయోడాటాను tomcome.itcoordinator@gmail.com కు పంపవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు సంబంధిత వెబ్‌సైట్ లేదా 83286 02231, 96406 30420 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

15న బీసీల రాజకీయ ప్లీనరీ



అభివాదం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్ : బీసీలకు రాజకీయ అధికారమే లక్ష్యంగా ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో గల కేబీఆర్ కన్వెన్షన్‌లో 10 వేల మందితో బీసీల రాజకీయ ప్లీనరీ నిర్వహిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యాంకురుమ అన్నారు. మంగళవారం స్థానికంగా జరిగిన బీసీ సంక్షేమ, విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు జనాభా ప్రకారం టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల దీపేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైద్యులు సత్యనారాయణ, బూడిద మల్లికార్జున్, జాజుల లింగంగౌడ్, శంకర్‌ముదిరాజ్, కాసోజు విశ్వనాథం, ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, కిరణ్, మధు, ఎలిజాల వెంకటేశ్వర్లు, వనం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

నల్లగొండ : ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 5వ తేదీ నుంచి హాల్‌టికెట్ డైన్‌లోడ్ చేసుకోవచ్చని స్టడీసర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీన రాత పరీక్షను సికింద్రాబాద్‌లోని యూనివర్సిటీ పీజీ కాలేజీ, దోమల్‌గూడలోని ఏవీ కాలేజీ, నాంపల్లిలోని సరోజిని నాయుడు వనితా మహావిద్యాలయ, కోఠీలోని ఉమెన్స్ కాలేజీలో, వరంగల్ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నిజామాబాద్‌లోని గవర్నమెంట్ గిరిరాజ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

బియ్యం.. పంపిణీ ఆలస్యం

- డీలర్లకు బయోమెట్రిక్ ద్వారా బియ్యం ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం
- కొన్ని చోట మొరాయిస్తున్న సర్వర్లు, పనిచేయని తూకం యంత్రాలు
- మరోవైపు కూలి రేటు పెంచాలని హమాలీల డిమాండ్
- ఇప్పటి వరకు 50 షాపులకు కూడా చేరని బియ్యం
- 7వ తేదీ నుంచి పంపిణీ చేస్తామంటున్న అధికారులు



జిల్లాలో రేషన్‌షాపుల	991
కార్డుదారులు	4,66,529
మొత్తం యూనిట్లు	13,96,933

పేదల బియ్యం పంపిణీలో అలస్యమవుతోంది. తరుగును నివారించేందుకు ప్రభుత్వం చేపట్టిన డీలర్ల బయోమెట్రిక్ ప్రక్రియలో జాప్యంతో బియ్యం నేటికీ రేషన్ షాపులకు చేరలేదు. మరోవైపు పని భారం పెరిగిందని హమాలీలు సహాయ నిరాకరణ చేస్తున్నారు. దీంతో పేదలు అర్థాకలితోనే పూట గడుపుతున్నారు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పేదలకు ఇవాల్సిన బియ్యం ఇంకా రేషన్ షాపులకు చేరలేదు. సాధారణంగా ప్రతి నెల ఒకటో తేదీలోగా రేషన్ షాపులకు బియ్యం చేరితే ఒకటో తేదీ నుంచి బియ్యం పంపిణీని ప్రారంభిస్తారు. అయితే ఈనెల నుంచి డీలర్లకు ఇచ్చే బియ్యాన్ని కూడా తూకం వేసి ఇవ్వాలని, దానికి బయోమెట్రిక్‌ను అనుసంధానించి ఈ ప్రక్రియను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మండల స్థాయిలోని మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లలో వేబ్రిడ్జిలు లేవు. 30 క్వింటాళ్ల చొప్పున తూకం వేసే యంత్రాలు ఉన్నా అవి పని చేయడం లేదు. కొన్ని చోట్ల పని చేస్తున్న వాటికి బయోమెట్రిక్ అనుసంధానం చేసినా సర్వర్లు పని చేయకపోవడం.. వీటన్నింటికి తోడు బియ్యం తూకం వేయాల్సిన హమాలీలు కూడా సహకరించకపోవడంతో రేషన్ షాపులకు బియ్యం చేరలేదు.

పని భారం పెరుగుతుందంటున్న హమాలీలు

హైకోర్టు ఆదేశాల మేరకు రేషన్ డీలర్లకు గోదాముల్లో బయోమెట్రిక్ విధానంతో బియ్యాన్ని తూకం వేసి ఇవ్వాల్సి ఉంది. ఆ నిబంధనలను అమలు చేయాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. అందుకు అనుగుణంగా బయోమెట్రిక్ విధానాన్ని వేయింగ్ మిషన్లకు లింక్ చేసి తూకం వేసేందుకు జిల్లా అధికారులు చర్యలకు ఉపక్రమించినా గోదా ముల వద్ద పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇప్పటివరకు ఎంఎల్ఎస్ పాయింట్లలోని బియ్యం బస్తాలను హమాలీలు నేరుగా లారీలోనే వేసేవారు. ప్రస్తుత విధానంలో ఒక్కో బస్తాను తెచ్చి తూకం యంత్రంపై వేసి, తూకం వేశాక మోసుకెళ్లి లారీలో వేయాల్సి వస్తోంది. దీంతో పనిభారం పెరుగుతోందని హమాలీలు చెబుతున్నారు. అందుకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని కోరుతూ సహాయ నిరాకరణ చేస్తున్నారు.

నష్టాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టినా

బఫర్ గోదాముల (స్టేజ్-1) నుంచి బియ్యం తూకం వేసి ఎంఎల్ఎస్ పాయింట్లకు పంపించాలి. అయితే అక్కడ తూకం వేయకుండానే పంపిస్తున్నారు. దీంతో ఎంఎల్ఎస్ పాయింట్లలో కూడా 50 కేజీల బస్తానే లెక్కగట్టి రేషన్ షాపులకు పంపుతున్నారు. తద్వారా డీలర్లకు క్వింటాల్‌కు 5 నుంచి 10 కేజీల వరకు తరుగు వస్తోంది. దీంతో తాము నష్టపోతున్నామని దీన్ని సరి చేయాలంటూ రేషన్ డీలర్లు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోలేదు. దీనిపై వారు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు జూలై నుంచి తూకం వేసి ఇచ్చేందుకు ప్రభుత్వం పూనుకుంది. అయితే ఎంఎల్ఎస్ పాయింట్ల 20 నుంచి 30 క్వింటాళ్ల వరకే తూకం వేసే ఎలక్ట్రానిక్ యంత్రాలు ఉన్నాయి. అవి సరిగా పనిచేయకపోవడం, సర్వర్లు మొరాయించడంతో బియ్యం రవాణాలో ఆలస్యమవుతోంది. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద వేబ్రిడ్జిలను ఏర్పాటు చేస్తే ఎలాంటి సమస్యా ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు బఫర్ గోదాముల వద్ద కూడా తూకం వేసే విధానం అమలు చేయాల్సి ఉంటుంది. లేకపోతే ఎంఎల్ఎస్ పాయింట్‌కు వచ్చే బియ్యం తగ్గిపోతే ఎవరు బాధ్యత వహిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

7 నుంచి పంపిణీకి ఏర్పాట్లు

రేషన్ షాపులకు బియ్యం రవాణాలో జాప్యం జరుగడంతో ఈనెల 7 నుంచి కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అప్పటివరకు అన్ని రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేస్తామని చెబుతున్నా, వెళతాయా? లేదా? అన్నది అనుమానమే.

50 శాతం బియ్యం చేరాల్సి ఉన్నా..

ప్రతి నెల 25వ తేదీ నుంచి 30వ తేదీలోగా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు బియ్యం చేరాలి. ఆ తరువాత ఒకటో తేదీన పంపిణీ ప్రారంభించి 15వ తేదీలోగా పూర్తి చేయాలి. అయితే ఈనెలలో 4వ తేదీ గడిచింది. ఇప్పటికే 50 శాతం బియ్యం రేషన్ షాపులకు చేరాల్సి ఉంది. ప్రజలకు పంపిణీ కూడా ఒకటో తేదీ నుంచి ప్రారంభం కావాలి. అయితే ఇప్పటి వరకు 50 షాపులకు కూడా చేరలేదు.

ఏఎమ్మార్పీకి నీటి విడుదల

- తాగునీటి కోసం ఉదయ సముద్రం నింపనున్న అధికారులు



అక్కంపల్లి వద్ద గేట్లు ఎత్తి ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు

గుర్రంపోడు : తాగునీటి అవసరాల నిమిత్తం ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు మంగళవారం నీటిని విడుదల చేశారు. సాగర్ నీటిమట్టం డెడ్ స్టోరేజీలో ఉండి ప్రస్తుతానికి నీటి లభ్యత లేని కారణంగా కేవలం తాగునీటి అవసరాలకు ప్రధాన కాల్వ వెంబడి 37 మేజర్ తూములను మూసి ఉంచి పానగల్ ఉదయసముద్రాన్ని నింపనున్నారు. ఇందు కోసం ప్రధాన కాల్వకు రోజూ 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నారు. ఉదయ సముద్రంలో 1.5 టీఎంసీల నిల్వ సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.7 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. నిబంధనల ప్రకారం ఉదయ సముద్రంలో ఎల్లప్పుడూ ఒక టీఎంసీ నీటిని నిల్వ ఉంచాల్సి ఉంది. అయితే, కృష్ణానదికి వరదలు ఆలస్యమైనా తాగునీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా ఇప్పుడే ఉదయ సముద్రంలో సరిపడా నీటిని నిల్వ చేయనున్నారు.

రైతులు గేట్ల జోలికి పోవద్దు : డివిజన్ ఈఈ

ఏఎమ్మార్పీకి ప్రస్తుతం తాగునీటి అవసరాలకే నీటిని విడుదల చేస్తున్నామని.. సాగర్‌లో నీటి లభ్యతను బట్టి సాగునీటికి షెడ్యూల్ ప్రకటించి ఆయకట్టుకు నీరు ఇస్తామని, అప్పటివరకు రైతులు ఎవరూ గేట్ల జోలికి వెళ్లవద్దని ఏఎమ్మార్పీ డివిజన్ ఈఈ ఆనందరావు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలనే లక్షల రూపాయలు వెచ్చించి గేట్లన్నీ మరమ్మతులు చేయించామని.. అన్ని గేట్లు మూసి ఉంచామని పేర్కొన్నారు. ఎవరైనా గేట్లు ఎత్తితే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. రైతులు సంయమనం పాటించి సహకరించాలని కోరారు.

పలువురు సీఐల బదిలీ

నల్లగొండ క్రైం : జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ పోలీస్‌శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ వన్‌టౌన్ సీఐ గోపిని వీఆర్ నల్లగొండకు బదిలీ చేయగా, జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఆదిరెడ్డిని డీటీసీకి, సీసీఎస్‌లో ఉన్న బాలస్వామి, రాజశేఖర్, డీటీసీలో ఉన్న జి.సత్యం, వీఆర్‌లో ఉన్న చంద్రయ్య, ప్రభాకర్‌రెడ్డిని ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని, సీసీఎస్‌లో ఉన్న జితేందర్‌రెడ్డిని వీఆర్ నల్లగొండకు, డీఎస్‌బీ (సస్పెన్షన్)లో ఉన్న జె.నాగేశ్వర్‌రావును సీసీఎస్ నల్లగొండకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కేంద్రీయ విద్యాలయంలో యూకేజీ అడ్మిషన్లు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ కేంద్రీయ విద్యాలయంలో యూకేజీకి ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టీఎస్.లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 6 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన బాల బాలికలు జూలై 6 నుంచి 18వ తేదీ వరకు www.kvsangathan.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

గ్రామాల్లో పనులను పర్యవేక్షించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా

- అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నల్లగొండ : గ్రామాల్లో జరుగుతున్న పనులను మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి జిల్లాస్థాయి అధికారులకు నివేదికలు పంపించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏపీఓలు, కోఆర్డినేటర్లతో తెలంగాణకు హరితహారం, గ్రామ పంచాయతీకి పక్కా భవనాలు, వైకుంఠధామాలు, స్వచ్ఛ సర్వేక్షణ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్లు, బీసీ సంక్షేమ శాఖచే వివిధ వృత్తుల వారికి ఆర్థిక సాయం అనే అంశాలపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో అమలవుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో కూలీల హాజరు సంఖ్య పెంచాలని సూచించారు. గ్రామపంచాయతీల వారీగా మొక్కల వివరాలు, లక్ష్యాలు ఎంపీడీఓలకు తెలిసి ఉండాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ఎంపీఓలు చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారంలో ప్రతిరోజు జరిగే కార్యక్రమాల వివరాలను జిల్లా అధికారులకు పంపించాలని సూచించారు. రాష్ట్రస్థాయి బృందాలు పర్యటించే అవకాశం ఉన్నందున సంపద వనాలకు స్థలాల గుర్తింపు, స్థలాలు గుర్తించిన చోట ఎస్టిమేట్లను సిద్ధం చేయాలన్నారు. గ్రామపంచాయతీ భవనాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిస్తున్నందున భవనాల వివరాలు, నిర్మాణంలో ఉన్న, నిర్మాణంలో లేని, నిర్మించినా కూడా మౌలిక సౌకర్యాలు కల్పించక ఆగిపోయినవి, నిర్మాణాలకు స్థలాలు లేనివి, స్థలాలు ఉన్నా ఇతర సమస్యలు ఉంటే వాటి వివరాలు వెంటనే మండలాల వారీగా పంపాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సంబంధిత ఇంజనీర్లను కోరారు. వైకుంఠధామాలకు విద్యుత్ కనెక్షన్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వివిధ వత్తుల వారికి ఆర్థిక సహాయం కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే గ్రామపంచాయతీల వారీగా పరిశీలించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్ రెడ్డి, డీఆర్‌డీఓ కాళిందిని, పంచాయతీ రాజ్ ఈఈ తిరుపతయ్య, మిషన్ భగీరథ ఈఈ ఇంజనీర్ ఎండీ.ముజిబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పాత వాహనాల వేలంతో రూ.7 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహించే వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : వివిధ కేసుల్లో ఉన్న వాహనాలను వేలం వేయడం ద్వారా రూ.7 లక్షల ఆదాయం సమకూరినట్లు ఎస్పీ అపూర్వరావు తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో 93 ద్విచక్ర వాహనాలు, 17 త్రిచక్ర వాహనాలు, ఐదు ఫోర్ వీలర్స్‌ను వేలం వేశారు. వేలం వేస్తున్న వాహనాలను ఎస్పీ పరిశీలించారు. వివిధ కేసుల్లో ఉన్న వాహనాలకు తగిన ఆధారాలు చూపి తీసుకపోవాలని పత్రికల ద్వారా తెలిపినా తగిన ఆధారాలు చూపకపోవడంతో వాటిని వేలం వేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్‌కె.ప్రసాద్, ఎంటీఓ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ సర్జన్‌రాజ్, ట్రాఫిక్ సీఐ శ్రీను, సూపరింటెండెంట్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి సస్పెన్షన్

నల్లగొండ, మర్రిగూడ : యాసంగి 2022 -23 సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు ఎక్కువ తీసిన ఆరోపణలపై మర్రిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి శివ సాయికుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి వై.రాజేందర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పీఏసీఎస్ చైర్మన్ పందుల యాదయ్య, సీఈఓ శ్రీనివాస్‌ను షోకాజు నోటీసులు ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు తెలియకుండా క్వింటాకు 10 కేజీల తరుగు తీసినందుకు వారిపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయొద్దు



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీకి చెందిన దుకాణాలను అక్రమంగా ఎవరికి రిజిస్ట్రేషన్ చేయవద్దని కోరుతూ కాంగ్రెస్ కౌన్సిలర్లు మంగళవారం మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కమిషనర్ కేవీ.రమణాచారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణాలను వీధి వ్యాపారుల పేరుతో బడా వ్యాపారులకు క్రమబద్ధీకరించవద్దన్నారు. 14 దుకాణాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా రద్దు చేయాలని కోరారు. గతంలో మాదిరిగానే బహిరంగ టెండర్ ద్వారా దుకాణాలను లీజుకు ఇచ్చి మున్సిపాలిటీకి ఆదాయం పెంచాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్లు కర్నాటి కరుణాకర్‌రెడ్డి, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, జూలకంటి ధనలక్ష్మి, ఇంతియాజ్, శంకర్, బుర్రి రజిత, హిమబింధు, ఆనంద్‌కుమార్, రాములమ్మ, నాయకులు ఉన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు పోరాడుదాం



కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరరుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ దున్నేవాడికే భూమి రావాలని, వెట్టి చాకిరి విముక్తి కోసం జమిందార్ల ఆగడాలను ఎదిరించి ఎర్రజెండా నాయకత్వంలో పోరాడి ప్రాణాలను అర్పించిన అమరుడు కొమురయ్య అని కొనియాడారు. కొమురయ్య స్ఫూర్తితో భవిష్యత్ ఉద్యమాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం జిల్లా స్థాయి తరగతుల ప్రారంభ సూచికంగా పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో తుమ్మల వీరారెడ్డి, డబ్బికార్ మల్లేష్, నాగార్జున, శ్రీశైలం, లక్ష్మీనారాయణ, ప్రభావతి, సలీం, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

మారిన 'మధ్యాహ్నం' మెనూ

- పోషక విలువలతో కూడిన ఆహారం అందజేత
- రోజూ మిక్స్‌డ్ కూరగాయలతో కూర ఉండేలా మార్పు
- వారానికి మూడు గుడ్లు, ఒక్క రోజు వెజ్ బిర్యాని



మిర్యాలగూడ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థినులు

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం మెనూలో మార్పులు తెచ్చింది. ఇప్పటి వరకు పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఇటీవల కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందాలు పరిశీలించాయి. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులపై ఆరా తీయగా విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందడం లేదన్న విషయం వారి దృష్టికి వచ్చింది. దీంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వారికి పోషక విలువలతో కూడిన ఆహారం అందేలా జాతీయ పోషకాహార సంస్థ మెనూలో మార్పులు చేసింది. తక్షణమే అమల్లోకి వచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల పునః ప్రారంభం నుంచి కొత్త మెనూను అమలు చేయాలని పాఠశాలల విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలను జారీ అయ్యాయి.

ప్రభుత్వ ఖర్చు ఇలా..

విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి సంబంధించి బియ్యం ప్రభుత్వం సరఫరా చేస్తుంది. కూరగయాలు, ఇతరాత్ర ఖర్చుల నిమిత్తం వంట ఏజెన్సీలకు ప్రాథమిక పాఠశాలల్లో (1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు) మధ్యాహ్న భోజనానికి రోజుకు ఒక్కో విద్యార్థికి రూ.5.45, ఉన్నత పాఠశాలల్లో (6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు) ఒక్కో విద్యార్థికి రూ.8.17 చొప్పున ఇస్తోంది.

కొత్త మెనూతో ఎంతో మేలు...

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 1483 ఉన్నాయి. వాటిలో సుమారు 90 వేల మందికిపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మధ్యాహ్న భోజనం కొత్త మెనూ అమలుతో వీరందరికీ మేలు కలగనుంది. పోషక విలువలతో కూడిన ఆహారం వారి ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుంది.

అదనపు భారం అంటున్న కార్మికులు

కొత్త మోనును రూపొందించినా.. కూరగాయాలు, ఇతర వస్తువులు కొనుగోలుకు ఇచ్చే మొత్తం, వంట ఏజన్సీలకు చెల్లించే గౌరవ వేతనంలో మార్పులు లేకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ధరలు మండిపోతుండడంతో మోనూలో మార్పులు చేయడం వల్ల తమపై అదనపు భారం పడుతుందని వాపోతున్నారు. మోనూ విషయంలో పకడ్బందీగా చర్యలు చేపడుతున్న అధికారులు.. రేట్ల పెంపు విషయంపై మాత్రం పెద్దవి విప్పడం లేదని పేర్కొంటున్నారు.

పోషకాహారం అందిస్తున్నాం



"రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ బడుల్లో మెనూ మార్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త మెనూను పూర్తిస్థాయిలో అమలు చేస్తాం. పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం పిల్లల అందిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నందు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలి.

– భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

మధ్యాహ్న భోజనం మోనూ ఇలా..

వారం	పాత మెనూ	కొత్తమెనూ
సోమవారం	అన్నం, గుడ్డు, కూరగాయల కూర	కిచిడి, మిక్స్‌డ్ కూరగాయాల కూర, కోడిగుడ్డు
మంగళవారం	అన్నం, పప్పు, కూరగాయలు	అన్నం, సాంబార్, మిక్స్‌డ్ కూరగాయాల కూర
బుధవారం	అన్నం, గుడ్డు, కూరగాయాల కూర	అన్నం, ఆకుకూర పప్పు, మిక్స్‌డ్ కూరగాయల కూర, కోడిగుడ్డు
గురువారం	అన్నం, కూరగాయాలతో సాంబార్	వెజిటెబుల్ బిర్యాని, మిక్స్‌డ్ కూరగాయాల కూర
శుక్రవారం	అన్నం, గుడ్డు, కూరగాయాల కూర	అన్నం, సాంబార్, మిక్స్‌డ్ కూరగాయల కూర, కోడిగుడ్డు
శనివారం	బిర్యాని	అన్నం, ఆకుకూర పప్పు, మిక్స్‌డ్ కూరగాయాల కూర

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

భువనగిరి: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఉన్నట్లు గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా ఉన్నాడని, అతడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని, తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్, మెడలో చిలుకపచ్చ రంగు కర్చీఫ్ ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుడి ఆచూకీ కోసం 8712658619, 8712568454 నంబర్లను సంప్రదించాలని రైల్వే జీఆర్పీ ఇన్చార్జి సత్యనారాయణ సూచించారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. వ్యక్తి దుర్మరణం


కృష్ణయ్య (ఫైల్)

కొండమల్లేపల్లి: ఆటోను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అజ్మాపురం గ్రామానికి చెందిన కంబాలపల్లి కృష్ణయ్య(60) చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలోని ఓ రైస్ మిల్లులో మంగళవారం వడ్లు పట్టించుకొని ఆటోలో కొండమల్లేపల్లిలో ఉంటున్న తన కుమార్తె, అల్లుడి ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై గల పెట్రోల్ బంక్ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన ఓ కారు ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న కృష్ణయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. వీఆర్ఏకు తీవ్ర గాయాలు

డిండి: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో వీఆర్ఏకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం డిండి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా పనిచేస్తున్న పోలం శేఖర్ తన బైక్‌పై కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తుండగా స్థానిక యూనియన్ బ్యాంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి రోడ్డుపై ఎగిరి పడిన శేఖర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి శేఖర్‌ను తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఇంటి స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో బుడిగజంగాల కుటుంబాలకు చెందిన ఇరు వర్గాల వారు ఇంటి స్థలం విషయంలో ఘర్షణకు దిగిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన నలుగురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. దీనిపై ఎస్ఐ సురేష్‌ని వివరణ కోరగా.. గొడవ జరిగిన విషయం తన దృష్టికి వచ్చిందని.. గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. బుధవారం వారిపై విచారణ చేసి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

200 కిలోల గంజాయి పట్టివేత

- ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి మహారాష్ట్రకు తరలించేందుకు యత్నం
- పక్కా సమాచారంతో పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు
- రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఆరుగురు నిందితుల అరెస్ట్, నల్లగొండ జైలుకు తరలింపు
- రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వివరాలు వెల్లడించిన సీపీ డీఎస్ చౌహాన్


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్


పట్టుబడిన గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

చౌటుప్పల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లాలోని సీలేరు ప్రాంతం నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి రవాణా చేస్తున్న ముఠాను మంగళవారం చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, చౌటుప్పల్ పోలీసులు సంయుక్తంగా ఈ ముఠా సభ్యులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ వెల్లడించారు. సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలన్న ఆశతో మహారాష్ట్రలోని పలు జిల్లాలకు చెందిన వివేక్‌మోహన్‌రావు హావెల్స్(36), గణేష్ మారుతీరావు దుమాల్(32), సచిన్ సురేష్‌గడే(32), సంతోష్ బహర్స్ పుహాడీ(32), సామ్రాట్ సురేంద్ర మానే(40), బిల్ అశోక్(45) ఒక ముఠాగా ఏర్పడి గంజాయి రవాణా చేయడం ప్రారంభించారు.

హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు..

ఈ ఆరుగురు ముఠా సభ్యులు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లాలోని సీలేరుకు చెందిన కేశవ్ అనే వ్యక్తి వద్ద రూ.3వేలకు కిలో చొప్పున 200 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని అక్కడే ప్యాకెట్లు రూపంలో మార్చి, వాటిని తమ వెంట తీసుకెళ్లిన మారుతీ ఎర్టిగా, మారుతీ స్విఫ్ట్ కార్లలో లోడ్ చేశారు. హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు తీసుకెళ్లేందుకు ముఠా సభ్యులు అక్కడ నుంచి కార్లలో బయల్దేరారు. మహారాష్ట్రలో కిలో రూ.20వేలకు అమ్మేందుకు ఒప్పందం చేసుకున్నారు.

పక్కా సమాచారంతో పట్టుకున్న పోలీసులు

గంజాయి ముఠా సభ్యులు రెండు వేర్వేరు కార్లలో హైదరాబాద్ వైపునకు వస్తున్నారని ఎస్ఓటీ పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు చౌటుప్పల్ పోలీసులతో సమన్వయం చేసుకొని చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన గంజాయి ముఠా సభ్యుల రెండు కార్లను ఆపి ప్రశ్నించగా వారి గుట్టు రట్టయ్యింది. వెంటనే ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు తమ కార్లకు తప్పుడు నంబర్ ప్లేట్లు వినియోగించినట్లు సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. వారి వద్ద 200కిలోల గంజాయి ప్యాకెట్లు, 6సెల్‌ఫోన్లు, రెండు తప్పుడు నంబర్ ప్లేట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను కోర్టులో రిమాండ్ చేసి జైలుకు తరలించినట్లు సీపీ వివరించారు. గంజాయి సరఫరా చేసిన సీలేరుకు చెందిన కేశవ్, మహారాష్ట్రలో కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్న దత్త పరారీలో ఉన్నారు. ఈ విలేకరుల సమావేశంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు. ముఠాను పట్టుకున్న పోలీసులను సీపీ అభినందించారు.

బీబీనగర్‌లో 24 కిలోలు..

బీబీనగర్: ములుగు జిల్లా నుంచి సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్‌కు కారులో అక్రమంగా తరలిస్తున్న 24కిలోల గంజాయిని సోమవారం రాత్రి బీబీనగర్ మండలంలోని కొండమడుగు మెట్టు వద్ద స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ యుగేంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం చిల్లేపల్లి తండాకు చెందిన సంతోష్ రాథోడ్ జహీరాబాద్ పట్టణంలోని మహీంద్రా కాలనీలో నివసిస్తున్నాడు. ఈజీ మనీకి అలవాటు పడ్డ సంతోష్ రాథోడ్ గంజాయి తరలించి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం గణేష్ రాథోడ్ అనే వ్యక్తి వద్ద నెలకు రూ.25 వేల చొప్పున చెల్లిస్తూ హోండా అమేజ్ కారును అద్దెకు తీసుకున్నాడు. గంజాయిని తరలించేందుకు వీలుగా ఆ కారు డిక్కీలో ఒక ఇనుప పెట్టను అమర్చాడు. గత మూడు నెలల నుంచి సంతోష్ రాథోడ్ ములుగు జిల్లాకు వెళ్తూ సత్యనారాయణ అనే వ్యక్తి వద్ద కిలోకు రూ.3500 చెల్లిస్తూ గంజాయి కొనుగోలు చేసి జహీరాబాద్‌కు తీసుకొచ్చి అక్కడ అధిక ధరకు కర్ణాటక రాష్ట్రానికి చెందిన శేషరావు, ప్రకాశ్‌లకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి కూడా ములుగు జిల్లాకు వెళ్లి 12 ప్యాకెట్లలో 24కిలోల గంజాయిని కొనుగోలు చేసి కారులో బీబీనగర్ మీదుగా జహీరాబాద్‌కు బయల్దేరాడు. పక్కా సమాచారం అందుకున్న బీబీనగర్ పోలీసులు కొండమడుగు మెట్టు వద్ద జాతీయ రహదారిపై కారును అడ్డుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సంతోష్ రాథోడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులతో పంచనామా చేయించి, నిందితుడిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంతోష్ రాథోడ్ వద్ద గంజాయి కొనుగోలు చేసిన ప్రకాశ్, శేషరావు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బీబీనగర్‌లో రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

బీబీనగర్: బీబీనగర్‌లోని ఎయిమ్స్ సమీపంలో సోమవారం రాత్రి రైలు పట్టాలపై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. భువనగిరి పట్టణంలోని ఆర్బీనగర్‌కు చెందిన దొంతిరెడ్డి పెద్దిరెడ్డి(42) మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధి నారపల్లిలోని ట్రాక్టర్ షెడ్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అదేవిధంగా బీబీనగర్ మండల పరిధిలోని రంగాపురంలో ఎకరం పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. రోజు మాదిరిగా పెద్దిరెడ్డి సోమవారం ఉదయం తన బైక్‌పై భార్యను ఎక్కించుకొని రంగాపురంలోని పొలం వద్ద దించి డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకుండా ఎయిమ్స్ సమీపంలోని రైలు పట్టాల వద్ద బైక్‌ను పార్కింగ్ చేసి గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం భార్య ఫోన్ చేస్తే ఇంటికి వస్తున్నాని చెప్పిన పెద్దిరెడ్డి రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించగా ఎయిమ్స్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో బైక్ కనిపించింది. పక్కనే రైలు పట్టాలపై చూడగా పెద్దిరెడ్డి మృతదేహం కనిపించింది. ఇటీవల కుమార్తె పెళ్లి చేసి అప్పుల బాధతోనే పెద్దిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

హుజూర్‌నగర్ వాసి అనుమానాస్పద మృతి


మృతుడి గుర్తింపు కార్డు

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా గాజువాక సమీపంలోని పంతులుగారి మేడ వద్ద జాతీయ రహదారి పక్కన డివైడర్‌పై సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. మృతదేహాన్ని మంగళవారం గుర్తించిన స్థానికులు గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్ఐ కొల్లి సతీష్ సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వద్ద దొరికిన ఆధారాలతో కామిశెట్టి అశోక్(39)గా గుర్తించారు. అశోక్ ముక్కు, నోటి నుంచి రక్తం కారిన ఆనవాళ్లు ఉన్నాయి. అతని జేబులో నిపాన్ సర్వీసెస్‌కు చెందిన గుర్తింపు కార్డు లభించింది. ఆర్టీసీ బస్ అటెండర్‌గా పనిచేస్తున్నట్లు అందులో ఉంది. ఆధార్ కార్డులో అశోక్, తండ్రి వెంకటేశ్వర్లు, డోర్ నంబర్ 12-57, పాత గ్రామపంచాయతీ వెనుక బజార్, హుజూర్‌నగర్, నల్గొండ అనే వివరాలు ఉన్నాయి. అశోక్ ఎలా మృతిచెందాడనే వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తెలుస్తాయని స్థానిక ఎస్ఐ తెలిపారు. మృతుడి వద్ద లభించిన వివరాలతో అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధం


దగ్ధమైన సామగ్రి

మఠంపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎలక్ట్రీషియన్ కస్తాల శ్రీను ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని టీవీ, బియ్యం, దుస్తులు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. రూ.50వేల విలువైన సామగ్రి కాలిబూడిదైనట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు. కాగా స్థానిక సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి దగ్ధమైన ఇంటిని పరిశీలించి ట్రాన్స్‌కో, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు

నల్లగొండ క్రైం: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేసి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు నల్లగొండ వన్ టౌన్ సీఐ గోపి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని లైన్‌వాడకు చెందిన గారాల శివశంకర్ ఫ్లవర్ డెకరేషన్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శివశంకర్ ఇప్పటికే ముగ్గురిని వివాహం చేసుకోగా, మే 8వ తేదీన బీటీఎస్ ప్రాంతానికి చెందిన బాలికను బలవంతంగా నాలుగో వివాహం చేసుకొని ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి జిల్లా జైలుకు రిమాండ్‌కు తరలించారు. కాగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శివశంకర్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసి మంగళవారం చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

డిండి: కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం డిండి పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి పట్టణానికి చెందిన నల్లగంతుల లక్ష్మయ్య మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నిరుపేద అయిన లక్ష్మయ్య వచ్చే కూలీ డబ్బులతో సంసారం వెళ్లదీయడం ఇబ్బందికరంగా మారడంతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం అతడిని నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని ఓ ప్రైవేట్ ఆస్పతికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

నల్లగొండ 'డైట్'లో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

నల్లగొండ: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై మంగళవారం నల్లగొండ పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 17 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొంపల్లి విద్యార్థులు మొదటి బహుమతి సాధించగా.. నార్కట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయ బహుమతి, పెద్దవూర ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడో బహుమతి సాధించారు. ప్రథమ స్థానం గెలుచుకున్నవారికి రూ.10 వేలు, ద్వితీయ స్థానం గెలుచుకున్నవారికి రూ.7500, తృతీయ స్థానంలో నిలిచివారికి రూ.5వేల ప్రోత్సాహక బహుమతిగా అందించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అరుంధతి, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, ఎల్‌డీఎం శ్రామిక్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కన్నతల్లిపై కుమారుడి దాడి

- భూమి అమ్మకానికి అడ్డుపడుతున్నదని కర్రతో తలపై కొట్టిన కొడుకు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

కట్టంగూర్: కన్నతల్లిపై కొడుకు దాడి చేసిన ఘటన కట్టంగూర్ మండలంలోని ఈదులూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. ఈదులూరు గ్రామానికి చెందిన సులువ లక్ష్మమ్మ భర్త రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఆమె తనకు ఉన్న ఇంటి స్థలాన్ని నలుగురు కొడుకులకు 260 గజాల చొప్పున సమానంగా పంచింది. ఇంటి స్థలంతో పాటు తనకున్న ఆస్తిపాస్తులన్నీ సమానంగా ఇచ్చింది. అయితే లక్ష్మమ్మ పెద్ద కుమారుడు నర్సయ్య తన భూమిని ఇతరులకు అమ్ముకుంటానంటే ఆమె అడ్డుపడుతున్నదని కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై మంగళవారం నర్సయ్యతో పాటు ఆయన కుమారుడు వినోద్ లక్ష్మమ్మతో మరోసారి గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఆమెను వారిద్దరు కర్రతో కొట్టడంతో కాలు విరిగింది. గ్రామస్తులు లక్ష్మమ్మను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గ్రామ యువత వయోవృద్ధుల టోల్‌ఫ్రీ నంబర్ 14567కు సమాచారం అందించగా, జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి ఆదేశాల మేరకు మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి మునగాల నాగిరెడ్డి లక్ష్మమ్మ వద్దకు వెళ్లి విచారించారు. జిల్లా కలెక్టర్ సూచన మేరకు కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో లక్ష్మమ్మ చేత కుమారుడిపై ఫిర్యాదు చేయించినట్లు నాగిరెడ్డి తెలిపారు. ఇదే విషయమై కట్టంగూర్ ఎస్ఐ రాజును వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి విచారణ చేపడతామని తెలిపారు.

కుటుంబ కలహాలతో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

- భర్త మద్యానికి బానిస కావడంతో తరచూ ఇంట్లో గొడవలు
- కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలుపుకొని తాగిన భార్యాభర్తలు, కుమార్తె
- పరిస్థితి విషమం.. ఖమ్మంలో చికిత్స

కోదాడరూరల్: భర్త మద్యానికి బానిస కావడంతో ఆ ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి కూడా గొడవ జరగడంతో క్షణికావేశంలో భార్యాభర్తలతో పాటు వారి కుమార్తె కూడా కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన కోదాడ పట్టణంలోని గణేష్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన ఎం. రామిరెడ్డి గ్రామంలో వ్యవసాయం చేయడంతో పాటు వరికోత మిషన్ల ఏజెంట్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. రాంరెడ్డి మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. వీరి కుమార్తె సీఏ పూర్తిచేసి ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరి వర్క్ ఫ్రం హోం చేస్తోంది. అమెరికా వెళ్లేందుకు కూడా ప్రయత్నిస్తుంది.

కోదాడకు వచ్చినా మార్పు రాలేదు..

గ్రామం విడిచి వెళ్తేనైనా పరిచయాలు తగ్గి రామిరెడ్డి మద్యం మానేస్తాడని నాలుగు నెలల కిందట కుటుంబం అంతా కోదాడకు వచ్చి గణేష్‌నగర్‌లో నివాసముంటున్నారు. మూడు నెలల వరకు బాగానే ఉన్న అతడు ఇటీవల మళ్లీ మద్యం తాగడం మొదలుపెట్టాడు. నాలుగు రోజుల క్రితం కూడా రాంరెడ్డి మద్యం తాగి ఇంటికి రాగా ఇంట్లో గొడవ జరిగింది. మధ్యలో రెండు రోజులు మద్యం మానేసిన అతడు సోమవారం రాత్రి ఫుల్‌గా తాగి ఇంటికి వెళ్లాడు. అతన్ని చూసిన భార్య, కుమార్తె 'మద్యం తాగొద్దని చెబుతున్నా ఎందుకు తాగుతున్నావు' అంటూ ప్రశ్నించడంతో వారి మధ్య గొడవ మొదలైంది. ఆ తర్వాత గొడవ పెద్దది కావడంతో ఆవేశంలో ముగ్గురూ కలిసి చనిపోదాం అనుకొని రాత్రి 10గంటల సమయంలో కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కొద్దిసేపటి తర్వాత కడుపులో మంట, వాంతులు కావడంతో ఒంటి గంట సమయంలో సమీపంలో నివసిస్తున్న తమ బంధువుకు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పారు. అతను అక్కడకు చేరుకొని స్థానికుల సహాయంతో ముగ్గురిని కోదాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మంగళవారం ఉదయం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రామిరెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. కాగా ఈ ఘటనపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బీబీనగర్‌లో దొంగల బీభత్సం

- వరుసగా ఏడు ఇళ్లలో చోరీ

బీబీనగర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వరుసగా ఏడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ కాలనికి చెందిన రొడ్డ యమున ఇంటికి తాళం వేసి వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఇంట్లోకిచొరబడి తులంన్నర బంగారంతో పాటు రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా సమీపంలోని పొట్ట వెంకటేష్ ఇంట్లో కూడా చొరబడి తులంన్నర బంగారం రూ.18వేల నగదు అపహరించారు. అనంతరం మరో 5 ఇళ్లలో చోరీకి యత్నించగా ఏమీ దొరక్కపోవడంతో అక్కడి నుంచి పారిపోయారు. మంగళవారం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగేందర్ తెలిపారు.

కోదాడలో తాళం వేసిన ఇంట్లో..

కోదాడరూరల్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో మంగళవారం తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసనగర్‌లోని భారత్ పబ్లిక్ స్కూల్ సమీపంలో నివాసముండే బియ్యం సుబ్రహ్మణ్యం భార్య ఇంట్లోనే చీరల వ్యాపారం చేస్తోంది. మంగళవారం పిల్లలను స్కూల్‌కు పంపిన తర్వాత ఇంటికి తాళం వేసి చీరలు తెచ్చేందుకు విజయవాడకు వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.60వేల నగదుతో పాటు వెండి ఆభరణాలు దొంగలించారు. వారు తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుడు వెంటనే కోదాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైతు ఉత్పత్తిదారుల క్షేత్రాన్ని సందర్శించిన అధికారులు


పేరేపల్లిలో రైతు ఉత్పత్తిదారుల క్షేత్రంలో వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు

చిట్యాల: మండలంలోని పేరేపల్లి గ్రామంలో గల పేరేపల్లి సమగ్ర వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల క్షేత్రాన్ని మంగళవారం తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, అండమాన్ నికోబార్ దీవులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక శాఖల అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు, వాటి మార్కెటింగ్ విధానాలను వ్యవసాయ క్షేత్రం సీఈఓ రూపని రమేష్, రైతులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా అధిక దిగుబడులు వచ్చేందుకు చేపడుతున్న చర్యలను, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ విస్తరణ విద్యాసంస్థ ప్రొఫెసర్ డాక్టర్ మధుబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో చిట్యాల శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీ, ఈస్తా సొసైటీ ప్రతినిధి తనుశ్రీ, కర్ణాటక వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకటేష్, అసిస్టెంట్ డైరెక్టర్ బెల్లంకిమెట్ శైలజ, తెలంగాణ, తమిళనాడు, ఏపీ పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ సుకన్య, రీనాక్షి సుందర్‌రాజన్, డాక్టర్ దీపక్ డానియల్, అధికారులు విజయ్ మిల్లర్, రైతులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధ్యం

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు


రైతులకు చేపపిల్లలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

త్రిపురారం: వ్యవసాయంతో పాటు రైతులు చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌లో గిరిజన ఉపప్రణాళికలో భాగంగా మండలంలోని పాల్తితండా, మిర్యాలగూడ మండలంలోని ఐలా పురం గ్రామంలోని గిరిజన రైతులకు చేపపిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు వ్యవసాయంలో వివిధ రకాల పంటల సాగుతో పాటుగా చేపల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం చేపపిల్లల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రశేఖర్, పల్లవి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధించడానికి పార్ట్‌టైమ్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీఓ లక్ష్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్, పీడీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ బోధించడానికి టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు జూలై 8వ తేదీ లోపు నల్లగొండ జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణం వద్ద జిల్లా మహిళా సమాఖ్య భవనంలో గల ఆర్‌సీఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి ఉండి అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- నల్లగొండ ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ ఎస్పీ అపూర్వరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనగల్ మండలం కేంద్రానికి చెందిన గట్టిగొర్ల అవినాష్ వాట్సాప్‌కి సైబర్ నేరగాళ్లు తక్కువ పెట్టుబడికి ఎక్కువ ఆదాయం వస్తుందని ఆన్‌లైన్ మార్కెటింగ్ మెసేజ్ పంపించారని, దీంతో అతడు మొదట రూ.50వేలు పెట్టుబడి పెట్టగా ఎక్కువ డబ్బులు ఇచ్చి నమ్మకం కల్పించారని పేర్కొన్నారు. అనంతరం అవినాష్ మరింత మొత్తంలో పెట్టుబడి పెట్టగా.. ఆన్‌లైన్ మార్కెటింగ్ యాప్‌లో రూ.90 లక్షలు కనిపిస్తున్నప్పటికీ వాటిని డ్రా చేయడానికి వీలు కాకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడని వివరించారు. వెంటనే సైబర్ క్రైం పోలీసులు సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాను సీజ్ చేసి రూ.19లక్షలు రికవరీ చేశారని ఎస్పీ తెలిపారు. అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లు, మెసేజ్‌లను ఓపెన్ చేసి మోసపోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే 1930, 155260 నంబర్లకు కాల్ చేసి వివరాలు తెలియజేస్తే సైబర్ నేరగాళ్లకు డబ్బులు వెళ్లకుండా సీజ్ చేస్తామన్నారు.

తుల శ్రీనివాస్‌కు జాతీయ కవితా పురస్కారం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లాకు చెందిన తుల శ్రీనివాస్ ఆచార్య కొలకనూరి ఇనాక్ జాతీయ కవితా పురస్కారానికి ఎంపికయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక కవితా సంపుటలలో జిల్లాకు చెందిన తుల శ్రీనివాస్ రచించిన 'చింతల తొవ్వ' పుస్తకం ఎంపికయ్యింది. ఈ నెల 9న సైమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన కవులు మునాసు వెంకట్, డాక్టర్ బెల్లి యాదయ్య, సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, పెరుమాళ్ల ఆనంద్, భానుశ్రీ కోత్వాల్ ఆయనకు అభినందనలు తెలిపారు.